# నాని

కొమ్మనాపల్లి గణపతి రావు

అసుర సంధ్య వేళ ....

ఎదురుగా ప్రవహిస్తున్న శారదా నది మెట్టినింటికి వెళ్ళే ముగ్ధలా ముందుకు సాగిపోతుంటే వేదం నిండిన గాలి సామగానంలా ఏటి పైనుంచి అల్లనల్లన తరలివస్తోంది.

తాత ఒడిలో కూర్చుని అంతవరకూ మంత్రపుష్పం వల్లెవేసిన నాని - 'చీకటి పడిపోతుందిగా తాతయ్యా ' అన్నాడు. ఇక వెళ్ళిపోదామన్న భావాన్ని పరోక్షంగా ధ్వనింపచేస్తూ.

"దొంగ భడవా... ఆకలేస్తోందని చెప్పొచ్చుగా"

ఎనిమిదేళ్ళ నానీని చూస్తూ నవ్వుతూ అన్నాడు విశ్వేశ్వరశాస్త్రి.

"అవును.....నాకు అదేంటోగాని పుట్టుట్టిగా ఆకలేస్తోంది"

"ఆకలేస్తోంది సరే......మరి నాకు నర్సరీ రైమ్ నేర్పవూ" అన్నాడు శాస్త్రి.

ప్రతి సాయంకాలమూ మనవడితో పాటు ఏటి ఒడ్డుకు వచ్చి వేదాన్ని బోధించడంతోపాటు మనవడి

రైమ్స్ వినడమూ ఆయనకి ఆనవాయితీయే.

"ఒడ్డున నడుచుకు వెళుతూ చేపపిల్లల ఈత చూద్దామా తాతయ్య"

తాతయ్యను మభ్యపెట్టాలనుకున్నాడు నిజంగా ఆకలి వేస్తుంటే.....

"చేపపిల్లకి ఈత, తాతకు దగ్గూ నేర్పాల్సిన అవసరం లేదుకాని ముందు నీ ఇంగ్లీష్ రైమ్ చెప్పరా గడుగ్గాయీ".

ఇక తప్పదనుకున్నాడు నానీ.

'ఓల్డ్ మదర్ హబ్బర్డ్

వెంట్ టు ది కప్‌బోర్డ్

టు గెట్ హెర్ పూర్ డాగ్ ఎ బోన్'

మసక చీకట్లో ఏటి ఒడ్డున గుండ్రని పండులాంటిదేదో కొట్టుకొస్తున్నట్టనిపించి ఏకాగ్రతగా చూశాడు.

'టు గెట్ హెర్ పూర్ డాగ్ ఎ బోన్'.......గొణుగుతూనే గుర్తు పట్టేశాడు కొట్టుకొస్తున్నది తాటిపండని.

రైమ్ మధ్యలోనే ఆపి నీటిని చేరుకొన్నాడుగాని అప్పటికే అది వేగంగా ముందుకెళ్ళిపోవడంతో బోలెడంత నిరుత్సాహ పడిపోయి 'బట్ వెన్ షి గాట్ దేర్ ది కప్ బోర్డ్ వజ్ బేర్' అన్నాడు చేతుల్ని త్రిప్పి

ఉక్రోషంగా.

"అంటే అర్ధమేమిట్రా నానీ?"

తాతలాంటి మేధావి అలా అర్ధం అడగడం నానీకి గర్వకారణమే గాని ఈవేళ ఈ తాటిపండు చేజారడం మహా కోపాన్ని తెప్పించింది.

"చెప్పరా భడవా"

"ఓల్డ్ మదర్ హబ్బర్డ్ అంటే తెలుసు కదా తాతయ్యా .. ముసలమ్మ అంటే మా నాయనమ్మ లాంటిదన్నమాట " తాటి పండు పదే పదే గుర్తుకొస్తుంటే తాటిపండు మీదినుంచి తాత మీదికి ప్రేమని మరల్చేసుకుంటూ చెప్పుకుపోతున్నాడు నీళ్ళ వైపు చూస్తూనే. "అప్పుడేమో వాళ్ళ బుల్లి కుక్కకి ఆకలేస్తే కప్ బోర్డ్ దగ్గరికెళ్ళిందన్న మాట ఏదన్నా పెడదామని ... అంతా ఖాళీ" నొసలు చిట్లించి చేతులు తిప్పుతూ బాధని ప్రకటించేశాడు"ఇంకేముంది....బుజ్జిముండ, అదే కుక్కపిల్ల ఆకలి తీరలేదన్నమాట".

"అంటే నీలాగ" గంభీరంగా నవ్వేశాడాయన "మరి ఆ ఆఖరి వాక్యం చెప్పలేదేమిరా?".

"ఏంటో" గుర్తు చేసుకోవడానికన్నట్టు కళ్ళు చిట్లించాడు నానీ.

"ఎండ్ సో ది పూర్ డాగ్ హేడ్ నన్" తాత తను విడిచి పెట్టిన ఆఖరి వాక్యం పూర్తి చేసేసరికి మహా అబ్బుర పడిపోయాడు.

"నీలాగే నేనూ ఏకసంధాగ్రాహినొరే... నువ్వు రోజూ చెప్పే రైమ్స్ నేనూ వల్లించేయగలను".

క్లాసులో చెప్పింది ఒకసారి విని తిరిగి అప్పచెప్పగానే తెలుగు టీచరు ఇలాగే అంటుంది. పైగా "ఎంతయినా విశ్వేశ్వరశాస్త్రిగారి మనవడాయే" అనికూడా అంటుంది

అలా అన్నప్పుడు తను తానుగా కాక ఆ మనవడిగా గుర్తించబడుతున్నందుకు మహా గర్వపడుతుంటాడు.

"అదే పోయిందిలే తాతయ్యా" అన్నాడు నాని చివరగా "రేపు చూసుకుందాంలే".

"ఏమిట్రా?"

"తాటిపండు"

"నీకా తాటిపండు యావ పోయినట్టులేదు"

"పోయిందిగా"

"యావే"

"కాదు తాటిపండు"

"ఈ ఏరుకి మనమంటే చాలా ఇష్టంలేరా. రేపు తాటిపండును తీసుకొచ్చి ఒడ్డున వదలి పెట్టి మరీ వెళుతుంది సరేనా"

"ఏరంటే అమ్మేంటీ దగ్గరకొచ్చి ఇచ్చి వెళ్ళడానికి" ఈ పాటికి తాటిపండు ఎంతదూరం వెళ్ళుంటూందా అని లెక్క వేసుకుంటూ అన్నాడు.

"అవున్రా ముసలాడా .....ఏరంటే అమ్మలాంటిదే.....ఎక్కడో పుడుతుంది.... మరెక్కడో ప్రవహిస్తుంది. దాహమేసిన వాళ్ళకి నీరిస్తుంది. తన ఉనికితో నేలను సస్యశ్యామలం చేస్తుంది" చెప్పుకుపోతున్నాడాయన "ఇన్ని సేవలు చేస్తూ కూడా అణువంత మెప్పుని సైతం ఆశించకుండా అలాగే సాగి సాగి ఆఖరి మజిలీని పూర్తి చేసుకుంటుంది."

అమ్మకి - ఏరుకి చెప్పిన పోలిక నానికి నచ్చింది కాని ఆ చెప్పిందే అర్థం కాకపోవడంతో గట్టిగా అడగాలనుకున్నాడు. కాని "తాతయ్యని నీ యక్ష ప్రశ్నలతో విసిగించకు" అన్న అమ్మ మాటలు గుర్తుకొచ్చి ఆగి పోయాడు.

చేయి పట్టుకుని నడుస్తూనే తల పైకెత్తి తాతయ్య మొహంలోకి చూశాడు.

శాసించే వేదంలా, బోధించే పురాణంలా రంజించే కావ్యంలా మూడు రూపాలూ మూర్తీభవించిన విశ్వేశ్వరశాస్త్రి నానికి తాతయ్య మాత్రమే కాదు ....... అమ్మనే పదాన్ని ఉచ్చరించడానికి ముందే ఓంకారం గురించి తెలియపరచిన తొలి గురువు.

కాన్వెంట్‌లో థర్డ్ స్టాండర్డ్ చదివే నానికి తాతయ్య చెప్పే శ్లోకాలు వల్లించడానికి నోరు తిరక్కపోయినా ఊరందరూ గౌరవించే తాతయ్యంటే తనకి వల్లమాలిన భక్తి కావడంతో చెప్పింది ఇట్టే పట్టేసి తాతయ్యని సం తృప్తి పరుస్తుంటాడు.

ఏటి ఒడ్డునుంచి మామిడి తోపులోకి అడుగుపెట్టిన విశ్వేశ్వరశాస్త్రి వృద్ధాప్యం మూలంగా కళ్ళు సరిగా కానరాక మనవడి చేయిని గట్టిగా పట్టుకున్నాడు.

కాలువ గట్టుమీదున్న సన్నని తూము దాటితే వూళ్లో అడుగు పెట్టినట్టే.
తాటి చెట్టును నరికి తోవగా చేసిన ఆ తూము దగ్గరికి రాగానే తనే ముందు నడుస్తూ వెనుకగా వచ్చే తాతయ్యకు ఆసరా ఇచ్చాడు నాని.

"నమస్కారం బావగారు" తూముకి ఆవలివేపు నిలబడ్డ రామనాధశాస్త్రి పలకరించాడు.

పాండిత్యంలో ఆయన కూడా ఉద్దండుడేకాని మరిది వరస కాబట్టి విశ్వేశ్వరశాస్త్రితో అప్పుడప్పుడూ ఛలోక్తులు విసురుతుంటాడు"ఏటికెళ్ళి వస్తున్నట్టున్నారు."

"అవును గూటికి చేరాలని" మృదుగంభీరంగా నవ్వాడు విశ్వేశ్వరశాస్త్రి.

"ఊతకర్ర లేనిదే వృద్ధాప్యం అడ్డుపడుతున్నట్టుంది" నానినే చూస్తూ అన్నాడాయన.

"తాత కర్ర ఆసరా లేకపోతే తనూ నడవనంటుంది ఊతకర్ర" మనవడితోపాటు ముందుకు నడిచాయన.

మరో అర ఫర్లాంగుదూరం నడిచారో లేదో హఠాత్తుగా ఓ ఇంట్లో నుంచి ఓ స్త్రీ ఆర్తనాదం వినిపించగానే క్షణం ఆగాడు.

అప్పటికే శాస్త్రిని చేరిన వయసుడిగిన రామిరెడ్డి" అయ్యా! కోడల్ని, కోడల్ని కొట్టి

చం పేస్తున్నాడు మా రంగడు" అంటూ చేతులు పట్టుకుని ప్రాధేయపడగా నెమ్మదిగా ఇంట్లో అడుగు పెట్టాడాయన.

తాగిన నిషాలో భార్యను చితకగొడుతున్న రంగారెడ్డి ఠక్కున ఆగి పోయాడు శాస్త్రిని చూడగానే.

ఏడుస్తూ శాస్త్రి కాళ్ళను చుట్టేసింది లక్ష్మి--రంగారెడ్డి భార్య.

"అయ్యా"రామిరెడ్డి చెప్పుకు పోతున్నాడు"సంపాదించే శక్తి లేనోడ్ని కాబట్టి ఇప్పుడు ఇంటిలో వాడిదే ఇష్టారాజ్యం అయిపోయింది. తాగి రావడం, పెళ్ళాన్ని చావ బాదడం ఇదే తంతయి పోయింది."

లక్ష్మిని ఆప్యాయంగా పైకి లేపాడు శాస్త్రి...... పూజలూ పునస్కారాలు పెద్దలయెడ గౌరవంగల ఆడపిల్లగా లక్ష్మి శాస్త్రికి తెలీనిది కాదు.

"కళంకం లేని మనస్సును నిష్కళంకంగా మరొకరికి అర్పించే ప్రక్రియే రంగా కళ్యాణమంటే.....భావం తెలుసుకుని ప్రవర్తించేది మంచి భార్య ఎలా అవుతుందో బాధ్యతను తీసుకుని భరించే వాడూ మంచి భర్త కాగలుగుతాడు. అత్తవారింటి మెట్లెక్కే మెట్టెలకి మకిలిపట్టినా అయినింటి ఆడపడుచు మెట్టినింట కన్నీళ్ళు పెట్టుకున్నా అది శుభప్రదం కాదు. నీ కోసం, నిన్ను నిలుపుకోవడం కోసం వ్రతాలు చేసే భక్తి గలదే భార్యంటే...మగాడు చేయగలిగేదీ చేయాల్సిందీ ఒకే ఒక వ్రతం.. అదే ఏకపత్నీవ్రతం... ఆ వ్రతం భగ్న మైందా అది నీకు శాపమే అవుతుంది."

రంగారెడ్డి తల వంచుకుని నిలబడిపోయాడు.

బిడియంగా నేల చూపులు చూస్తున్న అతడ్ని గమనించగానే అర్థ మైపోయింది, ఆ మాటలు ఎంత బలంగా పనిచేశాయా అన్నదీ.

నానితో బాటు శాస్త్రి బయటకి వచ్చేశాడు. మరో పది గజాల దూరం వెళ్ళేసరికి శాస్త్రిని చేరుకున్న
రామిరెడ్డి "పంతులుగారూ..." కృతజ్ఞతగా చూశాడు"వాడికి మీరంటే చెప్పలేనంత గురి.... అసలు మీకెప్పుడో చెప్దామనుకుంటూనే బాగా ఆలస్యం చేశానయ్యా.....మీకు కోపమొస్తే శాపంలా పనిచేస్తుందని అప్పుడప్పుడు మీ గురించి వాడు నాకు చెప్పింది గుర్తుచేసుకుంటే నా కోడలు బ్రతుకు మీరు తప్ప బాగుచేసే దేవుడెవరూ లేరయ్యా. పూర్తిగా మారిపోయాడు అనలేనుకాని ఎప్పుడయినా ఇటొచ్చినప్పుడు కాస్త ఇలాగే మందలిస్తుండండి చాలు".

బాల్యం నుంచీ జాగ్రత్తగా పెంచడం వలననేమో తన కొడుకు ఏనాడూ తను గీసిన గీత దాటనందుకు అంతర్గతంగానైనా ఎంతో సంతృప్తి పడ్డాడాయన.

నిజానికి ఆయన కూడా ప్రస్తుతం కొడుకు సంపాదనపై ఆధారపడి బ్రతుకుతున్నవాడే,

కాని ఎంత అణుకువని.

తన గదిలో ఏ గ్రంథ పఠనంలోనో మునిగిపోయే తను ఉన్నంత సేపూ అసలు గొంతు

సైతం వినిపిస్తుందా.

"తాతయ్యా!"

మనవడి పిలుపుతో ఆలోచనలనుంచి తేరుకున్నాడాయన.

"నీకు కోపమొస్తే శాపమైపోతుందా?"

రామిరెడ్డి మాటల్ని మననం చేసుకుంటూ నాని ఆ ప్రశ్న వేశాడని మృదువుగా నవ్వేశాడాయన.

"మరేం ...... నేనేం అంటే అది జరిగిపోతుంది."

"నిజం"

"ఆ......ఈ తాతయ్య కావాలనుకుంటే తాటిపండు కూడా ఠక్కున ప్రత్యక్ష మైపోతుంది."

"తాటిపండు కాదు తాతయ్యా............." మధనపడిపోతున్నాడు నాని ఎలా చెప్పాలో తెలీని సందిగ్ధతతో.

"సంగతేంట్రా తాతయ్యా.........." హఠాత్తుగా మనవడి కళ్ళలో నీరు చూసి కంగారుపడుతూ పైకెత్తుకున్నాడు.

"మరేమో" వెక్కిపడుతున్నాడు నాని "ఊరందరూ నీ మాట వింటారుగా--- మరి నాన్నకి చెప్పొచ్చుగా".

"ఏమని?"

"అమ్మని కొట్టొద్దని"

తత్తర పడిపోయాడాయన "అమ్మని కొట్టడమేంట్రా?"

"నాన్న రోజూ అమ్మని కొడుతుంటాడుగా" నానీ కళ్ళనుంచి నీళ్ళు ధారపడుతుంటే తట్టుకోలేక పోయాడాయన.

"ఎప్పుడు కొట్టాడు?"

"ఎప్పుడేమిటి...రోజూను....నువ్వు పడుకున్నాకా, మరేమో నువ్వు నిద్ర లేవకముందూ, ఇంకా నువ్వు వూళ్ళోకెళ్ళినప్పుడూ."

నాని అబద్ధం చెప్పడని, అసత్యం పలకడం నానికి చేత కాదని బాగాతెలిసిన విశ్వేశ్వరశాస్త్రి సన్నని ప్రకంపన శరీరాన్ని చుట్టుముడుతుంటే నెమ్మదిగా నానీని క్రిందకు దించాడు.

"ఎప్పుడూ చెప్పలేదేం మరి" అన్నాడు.

"అమ్మ చెప్పదుగా?"

"ఏం"

"అమ్మ కూడా ఏరులాంటిదన్నావుగా"

అవును. మహలక్ష్మిలా ఇంట అడుగు పెట్టిన కోడలు పావని ఈమధ్య శుష్కించిపోతోంది క్రమంగా.

ఎక్కడో పుట్టి మరెక్కడున్నుంచో ప్రవహించే నదిలా తన బ్రతుకు సేవలకే పరిమితమైనట్టు తన ఎండిపోతూ గండి పడుతున్న తన బ్రతుకు కథని చెప్పకుండానే నిశ్శబ్దంగా సాగిపోతోంది.

"మరి నువ్వయినా ఎప్పుడూ ఎందుకు చెప్పలేదు నానీ?" అడిగాడు నిశ్చలంగానే.

"చెప్పొద్దని అమ్మ ఒట్టేయించుకుందిగా."

అప్పుడు జారిపడింది ఓ నీటిబొట్టు ఆ వేదబ్రహ్మ కళ్ళనుంచి.

"అమ్మనడక్కు తాతయ్యా!"